క్లుప్తంగా

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ


సువర్ణాదేవి

ఉయ్యాలవాడ: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండల నూతన తహసీల్దార్‌గా బరిగెల సువర్ణాదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు కొలిమిగుండ్ల మండలానికి బదిలీ కావడంతో ఈ నియామకం జరిగింది. తహసీల్దార్ సువర్ణాదేవి అవుకు మండలం నుండి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానన్నారు.

రసీదు తప్పనిసరి

రుద్రవరం: విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో ప్రతి రైతు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి సుమతి అన్నారు. కోటకొండ, పెద్దకంబలూరు గ్రామాల్లో బుధవారం ఆమె ×పొలం పిలుస్తోంది× కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, ఈ ఏడాది కాస్త ముందస్తు వర్షాలు కురవడంతో అధిక శాతం మొక్క జొన్న, మినుము విత్తుతున్నారని అన్నారు. సంబంధిత దుకాణాదారుల నుంచి రసీదులు తీసుకోవడం ఎంతో అవసరమన్నారు. పంట మార్పిడితో తెగుల్లను నివారించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రాజు ఆయా గ్రామ సచివాలయ వీఏఏలు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవ వేడుకలు


అయ్యప్పస్వామి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గుడిపాటిగడ్డలో వెలసిన శ్రీఅయ్యప్ప స్వామి దేవస్థానంలో బుధవారం అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ట 35వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయాన్నే స్వామి వారికి సుప్రభాతసేవ, తిరుమంజన సేవ, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేక పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహామంగళ హారతి ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

20న స్విమ్మింగ్ పోటీలు


కర్నూలు (టౌన్): ఒలింపిక్స్ డే పురస్కరించుకొని ఈ నెల 20వ తేదీన నగరంలోని ఓల్డ్ రఘునాథ్ టాకీస్ వద్ద ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో అండర్–18 విభాగంలో స్విమ్మింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రతినిధి జేఎల్ఎన్ రెడ్డి ఆధ్వర్యంలో 18 సంవత్సరాల్లోపు క్రీడాకారులకు పలు విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. వివరాలకు 94402 51668 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఉపాధిహామీ పనుల తనిఖీ


క్రిష్టిపాడులో శ్రామికుల వివరాలను నమోదు చేసుకుంటున్న టీఏ

దొర్నిపాడు: మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీఓ హనీఫా బుధవారం పరిశీలించారు. ఈ సందర్భగా ఆమె మాట్లాడుతూ కొలతల మేరకు పనులు చేస్తే రూ.307 వేస్తారన్నారు. ఏప్రిల్ నెలాఖరు వరకు వేతనాలు చెల్లించినట్లు చెప్పారు. మే నెల నుంచి చెల్లించాల్సి ఉందని త్వరలో బ్యాంకు ఖాతాలో పడతాయని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఎఫ్ఏ మహమ్మద్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

చాగలమర్రి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న 17 మంది ఉపాధ్యాయులను, అలాగే వారి స్థానంలో బదిలీపై పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులకు బుధవారం ఘనంగా సన్మించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు జీవయ్య మాట్లాడుతూ ఉద్యోగులకు బదిలీలు సాధారణమన్నారు. ఎక్కడ పని చేసిన విద్యార్థులను తీర్చిదిద్ది సమాజానికి అందించాలన్నారు. ఈ సందర్భంగా వై.శ్రీనివాసులు, రవీంద్రనాథ్ రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, పీఈటీ దాదాపీర్, డి.షఫీరున్, వినయ్‌కుమార్, సుబ్రమణ్యం, బదిలీపై పాఠశాలకు వచ్చిన వారిలో ప్రధానోపాధ్యాయులు జీవయ్య, పీఈటీలు శ్రీనాథ్ రెడ్డి, ఆశాజ్యోతిలు ఉన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ఐడీకే శాస్త్రి, మహబుబ్‌బాషా, శివశంకర్, ఉస్మాన్, నారాయణమూర్తి, మోహన్‌రాజు తదితరులున్నారు.

గౌరవం లేదు.. వేతనం రాదు

- ఎంపీటీసీలకు అందని గౌరవ వేతనం
- ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానించని వైనం
- నిధుల మంజూరుపై సమాచారం ఇవ్వని అధికారులు



ఎంపీడీఓ కార్యాలయం

నంద్యాల(అర్బన్): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి స్థానిక ప్రజాప్రతినిధులకు విలువ లేకుండాపోతోంది. గ్రామంలో ఏ పనులు చేయించలేని పరిస్థితితో గౌరవం లేకుండా పోతుందని పలువురు ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం రెండేళ్ల నుంచి గౌరవ వేతనాలు అందడం లేదని ఆరోపిస్తున్నారు. నంద్యాల నియోజకవర్గంలో 31 మంది ఎంపీటీసీ (మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు) సభ్యులు ఉన్నారు. వారికి ప్రతి నెలా రూ.3వేల గౌరవ వేతనం ఇవ్వాల్సి ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రెండు విడతల్లో గౌరవ వేతనాలు చెల్లించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గత ప్రభుత్వం గౌరవ వేతనం ఎంపీటీసీలకు చెల్లించలేకపోయింది. 2024 జూన్‌లో కొత్తగా కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. అంతకుముందు పెండింగ్ వేతనాలతో పాటు దాదాపు రెండేళ్ల గౌరవ వేతనం రావాల్సి ఉంది. నేటికీ ప్రభుత్వం వాటిపై దృష్టి సారించలేదని ఎంపీటీసీలు వాపోతున్నారు. ప్రజలచే ఎంపికైన ప్రజాప్రతినిధులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పథకాల్లో ప్రాధాన్యం ఇవ్వకుండా టీడీపీ నాయకులకు ప్రాధాన్యం ఇస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సర్వసభ్య సమావేశాలకే పరిమితం..

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సర్వసభ్య సమావేశాలకు హాజరుకావడం మినహా ప్రజల సమస్యలను పరిష్కరించలేకపోతున్నామని ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల స్థాయి అధికారుల సమస్యలను తీసుకువచ్చినా పట్టించుకున్న పాపాన పోవడంలేదని చెబుతున్నారు. కనీసం ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు తమను ఆహ్వానించక పోవడం దారుణమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిధులు మంజూరుపై కనీస సమాచారం ఇవ్వకుండా వివక్షకు గురి చేస్తున్నారని వారు మండిపడుతున్నారు.

గౌరవ వేతనం మంజూరు చేయాలి



రెండేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం తక్షణమే చెల్లించాలి. అలవెన్స్ కూడా ఇవ్వడం లేదు. గతంలో మాకు ఇస్తున్న నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టాం. ప్రస్తుతం నిధులు మంజూరు చేయకపోవడంతో అభివృద్ధి పనులు ఆగిపోయాయి. సర్వసభ్య సమావేశాలకే పరిమితం చేశారు.
– అబ్దుల్‌రషీద్, అయ్యలూరు ఎంపీటీసీ

ఎంపీటీసీలు అంటే అలుసా



ఎంపీటీసీలు అంటే కూటమి ప్రభుత్వానికి అలుసైపోయింది. అందరూ ఆర్థికస్తోమత కలిగిన వారిలా ప్రభుత్వం పరిగణిస్తోంది. రెండేళ్లకు పైగా వేతనాలు ఇవ్వకపోతే సభలు, సమావేశాలకు ఎలా రావాలి. ప్రభుత్వం పెండింగ్ వేతనాల చెల్లింపుపై స్పందించాలి.
– దావీద్, చాబోలు ఎంపీటీసీ

మండల మీట్ మమ అనిపించారు!

- కోరం లేకుండానే సమావేశం


నివేదిక చదివి వినిపిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రమణ్యం

రుద్రవరం: మండల సర్వసభ్య సమావేశం అంటే ఒకప్పుడు వాడీవేడిగా సాగేది. సభ్యులు ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపేవారు. అధికారుల నిర్లక్ష్యాన్ని ఎండగట్టేవారు. కానీ ప్రస్తుతం సర్వ సభ్య సమావేశానికి సభ్యులు రావడమే గగనమైంది. వచ్చినా కుర్చీలకే పరిమితమవుతున్నారు.. వచ్చామా.. సంతకం పెట్టామా అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇందుకు బుధవారం జరిగిన మండల మీట్ నిదర్శనం. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ బాలస్వామి అధ్యక్షతన ఎంపీడీఓ భాగ్యలక్ష్మి మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. మొత్తం 14 మంది ఎంపీటీసీలు, ఒక కోఆప్షన్ సభ్యుడు కలిపి 15 మంది ఉండగా బుధవారం నిర్వహించిన మండల మీట్‌కు ఎంపీటీసీలు కాశన్న, రాణెమ్మ, మీరాంబీ, ఎంపీపీ బాలస్వామితో కలిపి మొత్తం నలుగురు మాత్రమే హాజరయ్యారు. కోరం లేక పోయినప్పటికీ సర్వసభ్య సమావేశం నిర్వహించడం విశేషం. సమస్యలపై గళమెత్తేవారు లేక పోవడంతో కేవలం గంటలోపే ఆయా శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించి ముగించారు.

రేపు ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఎస్పీజీ క్రీడా మైదానంలో ఈనెల 19వ తేదీన జిల్లా స్థాయి ఫుట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి వినయ్ సాగర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ బాలురు, బాలికల జట్లకు క్రీడాకారులను ఎంపిక చేస్తామన్నారు. 2010 జనవరి 1 నుంచి 2011 డిసెంబర్ 31వ తేదీ మధ్య పుట్టిన క్రీడాకారులు అర్హులన్నారు. సీఆర్ఎస్ పూర్తయిన ఆటగాళ్లు తమ సీఆర్ఎస్ ఐడీనెంబరులను చూపించాలన్నారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, ఫొటోలు సమర్పించాలన్నారు.

కౌలు రైతులకు 'అన్నదాత సుఖీభవ' వర్తింపజేయాలి

నంద్యాల(న్యూటౌన్): అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులందరికీ వర్తింపజేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారుల ఎంపిక వ్యవసాయాధికారులు, తహసీల్దార్లు ధ్రువీకరించాల్సి ఉందన్నారు. వీఏఏల స్థాయిలో పూర్తయ్యిందని, తహసీల్దార్ లాగిన్‌లలో రైతుల పేర్లు గల్లంతు కావడం జరిగిందన్నారు. ఎక్కువగా ఆధార్ నమోదు కావడంలో పేర్లు తప్పుగా అచ్చుపడటం వల్ల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న బయోమెట్రిక్ ద్వారా రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అందించవచ్చన్నారు. అర్హులైన రైతులకు ఈకేవైసీ నమోదు కోసం ఈనెల 30వ తేదీ వరకు గడువు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వక్ఫ్ భూముల రక్షణకు పకడ్బందీ సర్వే


వక్ఫ్ భూమిని సర్వే నిర్వహిస్తున్న జిల్లా ఇన్‌స్పెక్టర్ షేక్.ఇమ్రాన్, సర్వేయర్లు

చాగలమర్రి: వక్ఫ్ భూముల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని నంద్యాల జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ ఇమ్రాన్ అన్నారు. చాగలమర్రిలోని వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నాని ఇటీవల కొందరు కలెక్టర్ రాజకుమారికి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కొంత మంది ఆక్రమణ దారులకు సర్వే నోటీసు అందజేసి బుధవారం చాగలమర్రి మేజర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని వక్ఫ్ బోర్డు భూములను అధికారులు సర్వే చేశారు. 1114, 294, 1117, 218, 289 సర్వే నెంబర్లలో 72.15 ఎకరాల విస్తీర్ణంలోని భూములకు సంబంధించి సర్వే నిర్వహించి హద్దులు గుర్తించారు. అదే విధంగా భూములు, స్థలాల ఆక్రమణకు సంబంధించిన వివరాలను కూడా సేకరించామని నివేదికను సంబంధిత ఉన్నతాధికారులకు సమర్పిస్తామని వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ ఇమ్రాన్ తెలిపారు. సర్వేలో సర్వేయర్ మద్దిలేటి, వీఆర్‌ఓలు బాబయ్య, ఇమాంబాషా, శారద, ప్రసాద్ రెడ్డి, సచివాలయ సర్వేయర్లు హరేంద్ర, అఖిల్, పద్మావతి, లీలావతి పాల్గొన్నారు.

21 నుంచి సమ్మెలోకి మున్సిపల్ కార్మికులు


పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు ఈనెల 21వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు జిల్లా మున్సిపల్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దుర్గా, లక్ష్మణ్, రామాంజనేయులు, రంగనాథ్‌లు పేర్కొన్నారు. బుధవారం నంద్యాల పట్టణంలో మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బైక్ ర్యాలీ నిర్వహించారు. నంద్యాల పద్మావతినగర్ నుంచి టెక్కె, జనరల్ ఆసుపత్రి, నూనెపల్లె, చామకాల్వ సెంటర్, మున్సిపల్ కార్యాలయం వరకు బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో పని చేస్తున్న ఆపరేటర్స్, హెడ్ వాటర్ వర్క్స్, ఫిల్టర్ బెడ్ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు.. 263 మంది పని చేస్తున్నారన్నారు. కార్మికులకు జీవో నం.36 ప్రకారం రూ.24,500 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు ఆదాము, భాస్కరాచారి, రామకృష్ణ, కృష్ణయ్యరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి వేతనాలు ఇప్పించండి సార్..

ఉయ్యాలవాడ: జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనులు చేసినా వేతనాలు అందడం లేదని కొందరు వ్యవసాయ కూలీలు బుధవారం ఉపాధి కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన చిన్నమ్మ, లక్ష్మిదేవితో పాటు మరి కొందరు కూలీలు వేతనాలు తమ బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదన్నారు. రెండు నెలలు పైబడి ఉపాధి పనులకు వెళ్తున్నామని డబ్బులు పడడం లేదన్నారు. ఇలా అయితే ఎలా జీవనం కొనసాగించాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ వేతనాలు మంజూరు చేసి కూలీలను ఆదుకోవాలని వారు కోరారు.

మాన్యం కౌలుకు వేలం

శిరివెళ్ల: యర్రగుంట్ల శ్రీరామ స్వామి, ఈశ్వర, చెన్నకేశవస్వామి ఆలయాల మాన్యం భూముల కౌలు బహిరంగ వేలం పాటలు బుధవారం జరిగాయి. దాదాపు 69 ఎకరాల భూముల కౌలు వేలం పాటల ద్వారా ఆలయాలకు రూ. 10.90 లక్షలు కౌలు ఆదాయం వచ్చింది. గతం కంటే ఆదాయం తగ్గిందని ఈఓ నరసయ్య తెలిపారు. ఆదాయాన్ని ఆలయాల అభివృద్ధికి ఖర్చు చేయాలని గ్రామస్తులు అధికారులను కోరారు. వేలం పాటల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా సీఐ దస్తగిరి బాబు వేలం పాటల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

యోగాంధ్రకు బస్సులు.. ప్రయాణికులకు ఇక్కట్లు

- నంద్యాల నుంచి విశాఖ యోగాంధ్ర సభకు 30 బస్సులు
- తిరిగి 22వ తేదీ రాత్రికి నంద్యాలకు తిరుగుముఖం

నంద్యాల(వ్యవసాయం): మొన్న అమరావతి సభకు.. నిన్న మహానాడుకు.. నేడు విశాఖలో జరిగే యోగాంధ్రకు ఆర్టీసీ బస్సులు వెళ్లాల్సిందే.. ఎక్కడ కూటమి ప్రభుత్వం బహిరంగ సభ నిర్వహించాలనుకుంటే అప్పుడు జనాన్ని తరలించేందుకు ఆర్టీసీ బస్సులను దారి మళ్లిస్తుండటంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గత నెలలో ప్రధాని నరేంద్రమోదీ అమరావతికి వచ్చారు. ఆ సందర్భంలో నంద్యాల జిల్లా నుంచి 115 ఆర్టీసీ బస్సులను పంపించారు. ఆ తర్వాత మే చివరి వారంలో జరిగిన టీడీపీ మహానాడుకి 200 బస్సులను ఇక్కడి నుంచి తరలించారు. తాజాగా విశాఖపట్నంలో ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమానికి ఇక్కడి నుంచే 30 బస్సులను బుధవారం రాత్రి పంపించారు. తిరిగి ఈ సర్వీసులు ఈ నెల 22 లేదా 23 వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీంతో ఈ నాలుగు రోజులు తమకు అవస్థలు తప్పవని ప్రయాణికులు మండిపడుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఏ కార్యక్రమం జరిగినా ముందుగా ఆర్టీసీ బస్సులను వాడుకుంటున్న కూటమి పాలకుల తీరుపై పెదవి విరుస్తున్నారు. బుధవారం రాత్రి ఆళ్లగడ్డ నుంచి 4, ఆత్మకూరు 3, బనగానపల్లె 6, డోన్ 4, కోవెలకుంట్ల 7, నంద్యాల 6 బస్సులు వెళ్లాయి. గత కొన్నేళ్లుగా ఆర్టీసీ ఆదాయంలో నంద్యాల జిల్లా రాష్ట్రస్థాయిలో 11వ స్థానంలో ఉంటుంది. ఇప్పటికే రాష్ట్రంలోని ఇతర డిపోలతో పోలిస్తే నంద్యాల జిల్లా ఆదాయం తగ్గిపోతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఇలా ఆర్టీసీ సర్వీసులను అక్కడికి, ఇక్కడికి ఎడాపెడా వాడేస్తే ఆదాయం పడిపోతుందని ఆందోళన చెందాల్సి వస్తుందని అధికారులు వాపోతున్నారు.


నంద్యాల ఆర్టీసీ బస్టాండ్

వేలంపాటలో ఉద్రిక్తత


గ్రామస్తులను చెదరగొడుతున్న పోలీసులు

రుద్రవరం: చిలుకలూరు చెన్నకేశవ, ఈశ్వర స్వామి వారి మాన్యం భూముల కౌలు వేలం ఉద్రిక్తతకు దారి తీసింది. గ్రామానికి చెందిన కొందరు గత 20 ఏళ్ల నుంచి ఆలయాలకు సంబంధించిన లెక్కలు తెలియజెప్పాలని ప ట్టుబట్టారు. అలాగే ఆలయాలు శిథిలమయ్యాయి, వాటి స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని, సర్వే జరిపి హద్దులు తేల్చాలని భీష్మించారు. అలాగే ఆలయాల చుట్టూ ప్రహరీ నిర్మించాలని ఇవన్ని పూర్తి చేశాకే కౌలు వేలం నిర్వహించాలని కొందరు కోరారు. మాన్యం భూముల కౌలు వేలం ఆలస్యం అయితే పంటలు సాగు చేసుకోవడానికి ఇబ్బందిగా ఉంటుందని కావున వెంటనే కౌలు వేలం నిర్వహించాలని మరి కొందరు డిమాండు చేశారు. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. చేసేది లేక దేవదాయ శాఖ ఈఓలు నర్సయ్య, సాయి జయచంద్రారెడ్డి కౌలు వేలం నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. వెంటనే పోలీసులు జోక్యం చేసుకొని కౌలువేలం పాడేవారు మాత్రమే ఉండాలని మిగిలిన వారందరిని అక్కడి నుంచి పంపించేశారు. అనంతరం 39.21 ఎకరాలకు కౌలు వేలం నిర్వహించగా రూ.6.37 లక్షల ఆదాయం వచ్చింది. గతేడాది కంటే అదనంగా రూ.1.31 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈఓలు తెలిపారు. కౌలు వేలం వద్ద ఎలాంటి ఘర్షణలు జరక్కుండా శిరివెళ్ల ఎస్ఐ పీరయ్య యాదవ్, రుద్రవరం ఏఎస్ఐ రాంభూపాల్‌రెడ్డి సిబ్బంది ఉన్నారు.

డీఎస్‌డీఓకు ఆర్‌టీఐ నోటీసులు

- నేడు కమిషన్ ఎదుట హాజరుకావాలంటూ ఉత్తర్వులు

కర్నూలు(టౌన్): జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావుకు రాష్ట్ర సమాచార హక్కు చట్టం నోటీసులు జారీ చేసింది. ఈ నెల 19న గురువారం మంగళగిరిలోని సమాచార హక్కు కమిషన్ ఎదుట హాజరు కావాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నట్లు జిల్లా ఒలింపిక్ సంఘం నిర్వహక కార్యదర్శి సునీల్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడా శిక్షణ కార్యక్రమాలు, స్టేడియం ఆదాయం వివరాలు, ఏటా జరిగే ఆడిట్ రిపోర్టు, రసీదులు తదితర వివరాలను సమాచార హక్కు చట్టం ద్వారా కోరగా వివరాలు ఇవ్వకుండా స్టేడియం అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు చెప్పారు. దీంతో రెండో అప్పీల్‌గా రాష్ట్ర క్రీడా శాఖను సమాచారం కోసం సంప్రదించగా ఇక్కడ కూడా స్పందన లేదన్నారు. చివరకు ఈ ఏడాది ఏప్రిల్‌లో రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషన్‌ను ఆశ్రయించానని రెండు నెలల అనంతరం కమిషన్ స్పందించి జిల్లా క్రీడల అభివృద్ధి అధికారికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జిలు శైలజ, భాస్కర్

ఆళ్లగడ్డ: వచ్చే నెల 5వ తేదీన నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సమష్టిగా విజయవంతం చేద్దామని సీనియర్ సివిల్ జడ్జి శైలజ అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో బుధవారం పోలీస్ అధికారులు, న్యాయవాదులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్జిలు మెగా లోక్ అదాలత్ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించడమే లక్ష్యంగా పోలీస్, న్యాయవాదులు కృషి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సివిల్, రాజీపడదగిన క్రిమినల్ కేసులతో పాటు వాహన ప్రమాదం, చెక్‌బౌన్స్, కుటుంబ తగాదాల వంటి వివిధ రకాల కేసులను పరిష్కరించుకోవచ్చని కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్ అధికారులు, న్యాయవాదులు ఈ విషయంలో అందరూ సమన్వయంతో చొరవ చూపితే కేసులను వెంటనే పరిష్కరించడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రమోద్, నియోజకవర్గంలోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

విద్యాసంస్థల వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలి


డీఈఓకు వినతి పత్రం అందజేస్తున్న ఏఎస్ఎఫ్ఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలని ఏఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సూర్యప్రతాప్ మాట్లాడుతూ చైతన్య, నారాయణ, భాష్యం, ఎల్‌కే ఆర్, తదితర విద్యాసంస్థలు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, అడ్మిషన్ డొనేషన్ అంటూ విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అమ్మకాలు చేపడుతున్నాయన్నారు. పాఠశాలల్లో ఆటస్థలం, బిల్డింగ్ ఫిట్‌నెస్, ఫైర్ అనుమతులు లేకుండా నడుపుతున్నారని, చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శశిధర్, ధనుష్, చందు, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఝాన్సీ లక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకోవాలి


ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): రాణి ఝాన్సీ లక్ష్మీబాయిని బాలికలు ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్రీయ ధర్మరక్షాదళ్ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఝాన్సీలక్ష్మీబాయి వర్ధంతి సందర్భంగా స్థానిక నూనెపల్లె ప్రభుత్వ పాఠశాలలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఝాన్సీ లక్ష్మీబాయి చిన్నప్పటి నుంచే యుద్ధ నైపుణ్యాలు నేర్చుకుని 1857 తిరుగుబాటులో ముఖ్యమైన నాయకురాలిగా బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడి వీరవనితగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో నాయకులు శివ, ప్రతాప్, సతీష్, గంగాధర్, మహేష్‌గౌడ్, పాఠశాల హెచ్ఎం రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పనిగంటల పెంపు అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న దేవదానం

నంద్యాల(న్యూటౌన్): పని గంటల పెంపు నిర్ణయం అన్యాయమని, ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 20వ తేదీన ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యమాలతో శ్రామిక దోపిడీని అరికట్టి 8 గంటల పనిని సాధించామన్నారు. ప్రస్తుతం చాలీచాలని వేతనాలతో కార్మిక కుటుంబాలు అతలాకుతలమవుతున్నాయని, కార్మికులకు పనిగంటలు పెంచడం వల్ల మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా ఉందన్నారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో యూనియన్ నాయకులు శీను, వెంకటేశ్వర్లు, చౌదరి, భూపని శ్రీనివాసులు, దేవదానం, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహించాలి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి


పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

నంద్యాల(న్యూటౌన్): వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు.. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ×వ్యవసాయ యాంత్రీకరణ (ఎస్ఎంఏఎం) సబ్–మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మెకనైజేషన్ పథకం కింద వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ .. రానున్న రోజుల్లో నంద్యాల రకం యాపిల్ పండు కూడా మార్కెట్లోకి వచ్చే అవకాశం ఉందన్నారు. జపాన్ దేశంలో పండించే మియా జాకీ అనే మామిడి పండు అక్కడి వాతావరణ పరిస్థితులకు చెట్టుకు ఆరు పండ్లు కాస్తే, అదే చెట్టును జిల్లాలో వేయగా ఇక్కడి వాతావరణ పరిస్థితులకు వంద పండ్లు కాయడం జరుగుతోందన్నారు. శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు, మెలకువలను రైతులు పాటిస్తూ పండించిన పంటకు వారే ధరను నిర్ణయించే స్థాయికి ఎదగాలన్నారు. పంట పొలాలను ఖాళీగా ఉంచకుండా ఏదో ఒక పంట వేయాలన్నారు. అనంతరం జిల్లాలో 964 మంది చిన్న, సన్నకారు రైతులకు రూ.1.99 కోట్ల వ్యవసాయ పరికరాల రాయితీ చెక్కును అందజేశారు. అంతకుముందు వ్యవసాయానికి అవసరమైన పనిముట్లు, సాంకేతికత పరంగా అవసరమైన సహాయ సహకారాల గురించి రైతులు వ్యవసాయ అధికారులను వివరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, సహాయ వ్యవసాయ అధికారులు, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్య జీవనం


యోగా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజకుమారి, సర్పంచ్ ఈరమ్మ

ఆళ్లగడ్డ: ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యలో భాగం చేసుకుని ఆరోగ్యకర జీవనం కొనసాగించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో ప్రధానార్చకులు కిడాంబి వేణుగోపాలన్ అధ్యక్షతన సామూహిక యోగా కార్యక్రమం నిర్వహించారు. పర్యాటకాన్ని పరిచయం చేస్తూ.. యోగాపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమం దేవస్థానాల్లోనూ చేపడుతున్నామన్నారు. ఈ నెల 21న ప్రధాని నరేంద్రమోదీ విశాఖ వస్తున్నారని, యోగాంధ్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాసారి ఈరమ్మ, ఉప సర్పంచ్ సల్లా మధు, తహసీల్దార్ రత్నకుమారి పాల్గొన్నారు.